క్లుప్తంగా

నేడు కార్తిక వన భోజనం

చాపాడు: మైదుకూరు మండల పరిధిలోని లెక్కల వారిపల్లె గ్రామ దగ్గరనున్న ఎస్సార్-2 డ్యామ్ సమీపంలోని శివాలయం వద్ద సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కార్తిక వన భోజనం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. మూడో కార్తిక సోమవారం పురస్కరించుకుని నిర్వహించనున్న కార్యక్రమానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరుకానున్నారు. ఉదయం 9.30 గంటలకు మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేరుకోవాలని కోరారు.

రేపు మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమం నిర్వహిస్తామని కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

ఘనంగా గౌరమ్మ నిమజ్జనం


తెలుగుగంగ కాలువలో గౌరమ్మను నిమజ్జనం చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

కలసపాడు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో పసుపుతో తయారు చేసిన గౌరమ్మ ప్రతిమకు మూడు రోజులు పూజలు నిర్వహించారు. ఆదివారం గౌరమ్మను మహిళలు అమ్మవారిశాల నుండి తెలుగుగంగ కాలువ వరకు భజనలు, గౌరమ్మ నామస్మరణతో ఊరేగింపుగా తీసుకెళ్ళి తెలుగుగంగ కాలువలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

అమెరికాలో కార్తిక వనమహోత్సవం

పోరుమామిళ్ల: అమెరికాలోని చార్లెట్‌లో ఆదివారం జరిగిన వనమహోత్సవ కార్యక్రమంలో పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదనం ఉట్టిపడేలా ఉత్సవాలు నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. విదేశాల్లో స్వదేశాన్ని మరిపిస్తూ జరిగిన వనమహోత్సవంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన తెలిపారు.

బలిజ వర్గీయుల ఆధ్వర్యంలో..


వనమహోత్సవానికి ప్రదర్శనగా వెళుతున్న బలిజవర్గీయులు

పోరుమామిళ్ల: బలిజ వర్గీయుల వనమహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. రాయల సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ వనమహోత్సవంలో పార్టీలకు అతీతంగా నాయకులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానం దగ్గర నుంచి భైరవేశ్వర స్వామి, శ్రీకృష్ణదేవరాయల భారీ ఫ్లెక్సీలతో ప్రదర్శన నిర్వహించారు. చెరువుకట్టపై నిర్మించిన భైరవేశ్వరస్వామి ఆలయం వద్ద భోజనాలు తయారు చేశారు. అక్కడ స్వామికి పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అందరూ ఆనందంగా వనమహోత్సవం జయప్రదం చేశారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కమిటీ ఏర్పాటు

గోపవరం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నూతన విగ్రహ ఏర్పాటు కొరకు త్వరలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి మీసాలరవి తెలిపారు. ఆదివారం మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మున్సిపాలిటీ పరిధిలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నూతన విగ్రహ ఏర్పాటు కోసం, దళిత సమస్యలపై వారు మాట్లాడారు. నూతన విగ్రహ ఏర్పాటు అనుమతి కోసం సోమవారం నిర్వహించే ప్రజావేదికలో ఆర్డీఓ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే ప్రజాసంఘాల నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలవనున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పోరుమామిళ్ల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్, విశ్రాంత ఉపాధ్యాయుడు ఆలమూరి వెంకటస్వామి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం లైబ్రేరియన్ ఆఫ్రిది ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో వారు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి మొక్కలు నాటి పెంచాలన్నారు.

కొత్త పింఛన్లకు దారేది?

- ఐదు నెలలైనా తెరుచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- జగన్ ప్రభుత్వంలో నిరంతర ప్రక్రియగా కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు



కొండ్రాజుపల్లె సచివాలయం

కాశినాయన: నరసాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వృద్ధునికి ఐదు నెలల క్రితమే 60 సంవత్సరాలు వయస్సు నిండింది. పింఛన్‌కు అర్హత వచ్చింది కదా అని దరఖాస్తు చేసుకుందామని సచివాలయానికి వెళితే ఇంకా వెబ్‌సైట్ రాలేదని అన్నారని వాపోయాడు. అకులనారాయణపల్లె గ్రామానికి చెందిన పుల్లమ్మ భర్త నాలుగు నెలల క్రితమే చనిపోవడంతో వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయానికి వెళితే కొత్త పింఛన్లు ఇంకా ఇవ్వలేదు. మళ్ళీ రావాలని చెప్పారంటూ కన్నీటిపర్యంతమైంది. ఎస్టీకాలనీకి చెందిన హనుమంతు కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సచివాలయానికి వెళితే ఇంకా అనుమతులు రాలేదు, దరఖాస్తులు తీసుకోవడం లేదని ఆవేదన చెందుతున్నాడు. ఇదీ ప్రస్తుత కొత్త పింఛన్లు, కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వారి మనోవేదన. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో పింఛన్లు, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగేది. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా ప్రస్తుత ప్రభుత్వం వెబ్‌సైట్ ఓపెన్ చేయకుండా ఉందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. కొత్త పింఛన్ దరఖాస్తు చేసుకునే క్రమంలో నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేకపోతున్నామని అర్హులు చెబుతున్నారు. అంతేకాకుండా కొత్తగా వివాహాలు అయిన వారు కొత్తగా రేషన్‌కార్డు పెట్టుకునేందుకు కూడా ప్రభుత్వం ఎప్పుడు వెబ్‌సైట్ ఓపెన్ చేస్తుందా అని ఎదురుచూపులు చూస్తున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన వెబ్‌సైట్

ఏప్రిల్ 18 నుండి ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన వెబ్‌సైట్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్నా ఇంకా ఓపెన్ చేయకపోవడం ఏమిటని ప్రజలు సచివాలయాలకు వెళ్ళి నిలదీస్తున్నారు. జూన్ 12న కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ తీసుకునేందుకు 60 సంవత్సరాలు నిండిన వృద్ధులు, వికలాంగత్వ నిర్ధారణ ధృవీకరణపత్రం పొందిన దివ్యాంగులు, భర్త చనిపోయిన వితంతువులు కొత్త పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారు. అలాగే కొత్తగా రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఎప్పుడు అనుమతి ఇస్తుందా అని కొత్త రేషన్‌కార్డు దారులు కూడా పడిగాపులు కాస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఇలా..

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వలంటీర్ల ద్వారా ఇంటింటికి వెళ్ళి ధృవపత్రాలు తీసుకుని అర్హులైన వారిని గుర్తించి వలంటీర్లే దరఖాస్తులు చేసేవారు. అలాగే కొత్త రేషన్ కార్డులకు వలంటీర్లే సచివాలయంలో దరఖాస్తులను అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఇంత వరకు పాత పింఛన్ల పంపిణీ తప్ప మరే ఇతర సంక్షేమం అందించే ఊసే లేదంటూ ప్రజలు మండిపడుతున్నారు. వచ్చే నెలలో ఓపెన్ చేస్తారనే ఊహాగానాలు వెలువడుతుండటంతో ప్రజలు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఆదేశాలు రావాలి

కొత్త పింఛన్లు, కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేదు. అనుమతులు వచ్చిన తర్వాత దరఖాస్తులను స్వీకరిస్తాం. అంతవరకు సంయమనం పాటించాలి. – మైథిలి, ఎంపీడీఓ, కాశినాయన మండలం

అవినీతి జరిగి ఉంటే జగనన్న ఇళ్లపై విచారణ చేయించండి

- టిడ్కోలో ఒక్క ఇంటినైనా ప్రారంభించారా?
- ఉద్దేశ పూర్వకంగానే ఎమ్మెల్యే వరద విమర్శలు
- ప్రెస్‌మీట్‌లో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: అవినీతి జరిగిందని భావిస్తే ప్రొద్దుటూరులో నిర్మిస్తున్న జగనన్న కాలనీల ఇళ్లపై ప్రభుత్వంతో విచారణ చేయించి నిగ్గు తేల్చాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి చేసిన విమర్శల్లో వాస్తవాలు లేవన్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో ప్రొద్దుటూరు నియోజకవర్గం అంతటికీ కలిపి 23వేల ఇళ్లు మంజూరు చేయించామని తెలిపారు. బొల్లవరం జగనన్న కాలనీలో 10,462, రామేశ్వరంలో 7,647, మీనాపురంలో 4,958 ఇళ్లు మంజూరు చేయించామని, ఈ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. జగనన్న కాలనీల్లో రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించామన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.లక్షా 80వేలు సరిపడదని అదనంగా ప్రతి లబ్ధిదారు నుంచి రూ.35వేలు తీసుకోవాలని స్వయంగా ప్రభుత్వమే ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. కొంత మంది లబ్ధిదారులు కాంట్రాక్టర్లకు ఈ డబ్బు ఇవ్వలేదని, మరికొంత మంది డబ్బు ఇచ్చిన మహిళలకు కాంట్రాక్టర్లు ఇళ్లు నిర్మించి ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే వరద ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయించి కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించేలా చూడాలని సూచించారు. చట్ట ప్రకారమే అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయించామన్నారు. రేషన్ కార్డుల ఆధారంగా కొంత మంది ధనవంతులకు కూడా ఇళ్లు వచ్చిన మాట వాస్తవమేనని, చేతనైతే వరద అలాంటి వారిని ఏరివేయించాలని కోరారు. జగనన్న కాలనీల్లో అవినీతి జరిగిందని ఎమ్మెల్యే వరద విమర్శలు చేస్తున్నారని, వారి ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పుడు విచారణ చేపట్టి వాస్తవాలను నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. గతంలో గుట్కా, మట్కా, ఎర్రచందనం, ఇసుక మాఫీయా అంటూ విమర్శలు చేశారని, ఎప్పుడైనా వీటిపై విచారణ చేయించుకోవచ్చునన్నారు. బట్ట కాల్చి మొహాన వేయడం వరదరాజులరెడ్డికి మాత్రమే చెల్లుతుందన్నారు. 2009లో తనపై హత్యాయత్నం చేయించినప్పటి నుంచి ఇప్పటి వరకు పరిస్థితులు అలానే ఉన్నాయని, రాజీ పడి మాట్లాడే ప్రసక్తే ఉండదన్నారు.

టిడ్కోలో ఒక్క ఇల్లు అయినా నిర్మించారా?

2014 నుంచి 2019 వరకు ప్రొద్దుటూరులో ఒక్క టిడ్కో ఇంటినైనా పూర్తి చేసి ప్రారంభించారా అని రాచమల్లు ప్రశ్నించారు. మున్సిపాలిటీకి సంబంధించి 4150 ఇళ్లు మంజూరయ్యాయని, వీటిలో 1920 ఇళ్లు మొదలు పెట్టారన్నారు. 908 మంది లబ్ధిదారులు తమకు టిడ్కో ఇళ్లు వద్దని చెప్పడంతో అప్పట్లో మీరు పట్టించుకోకున్నా మా ప్రభుత్వంలో లేఖ రాసి రూ.కోటి 8 లక్షల డిపాజిట్లు తిరిగి ఇప్పించానన్నారు. తమ ప్రభుత్వంలో పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణం, మార్కెట్ నిర్మాణం, వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. బస్టాండ్ నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్లు జి.లావణ్య, పాతకోట వంశీధర్‌రెడ్డి, సత్యం, నూకా నాగేంద్రారెడ్డి, పోసా భాస్కర్ పాల్గొన్నారు.

మాలల ద్రోహులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్


మాట్లాడుతున్న మనోహర్

ప్రొద్దుటూరు: మాలల ద్రోహులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోస మనోహర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మాల కులాన్ని అణగదొక్కడమే టీడీపీ, జనసేన పార్టీల వైఖరి అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు వన్‌మెన్ కమిషన్‌ను సీఎం చంద్రబాబు నాయుడు వేశారన్నారు. ఈ కమిషన్ రాజ్యాంగబద్ధమైనదా.. ఇది టీడీపీ కమిషన్ అన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా మాల కుల జనాభా ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలంటే ఏ కులానికి ఎన్ని ఉద్యోగాలు వచ్చాయో స్పష్టంగా ప్రతి ఒక్కరిని జల్లెడ పట్టి ప్రతి ఒక్కటీ బయటికి తీయాలన్నారు. మాల కులానికి 15 శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్నారు. మాల కులానికి తీవ్ర అన్యాయం చేస్తున్న టీడీపీ, జనసేన పార్టీలకు రాబోయే రోజుల్లో ఓటు టు ద్వారా మాలలు బుద్ధి చెబుతారన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం


శ్రీనివాసులరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు ఎవరూ కూడా అధైర్య పడొద్దని, పార్టీ తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టు బత్తలపల్లి శ్రీనివాసులరెడ్డి కుటుంబ సభ్యులను ఇటీవల పోలీసులు వేధించిన నేపథ్యంలో ఆదివారం శ్రీనివాసులరెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే సోషల్ మీడియా యాక్టివిస్టులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నాడన్న కారణంగా ఇటీవల శ్రీనివాసులరెడ్డి ఇంటికి వచ్చిన పోలీసులు అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడి భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. శ్రీనివాసులరెడ్డి బ్రతుకుదెరువు కోసం కువైట్‌లో ఉంటున్నాడని తెలిపినప్పటికీ లెక్క చేయకుండా మహిళలను భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పోలీసులపై న్యాయపోరాటం చేసేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని, ఎవరూ కూడా భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఏ కష్టం వచ్చినా వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్భాటాలు తప్ప ఆచరణ శూన్యం


నామమాత్రంగా నీటిని విడుదల చేస్తున్న కూటమి ప్రభుత్వ నాయకులు (ఫైల్)


నేడు నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకం

బి.కోడూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి మండలంలో ఆర్భాటాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందే తప్ప వాటిని అమలు చేయడంలో విఫలమైంది. అందుకు నిదర్శనమే మండలంలోని మున్నెల్లి ఆయకట్టు చెరువుకు ఎత్తిపోతల పథకం కింద 2016లో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు. అందుకు సంబంధించి ఆ సమయంలో పనులన్నీ పూర్తి చేసినప్పటికీ మోటార్లు, విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్భాటంగా మొదట్లో మున్నెల్లి ఆయకట్టు చెరువుకు ఎత్తిపోతల పథకం ద్వారా నామమాత్రంగా నీటిని అందించారు. మరుసటి రోజు నుండి అందుకు సంబంధించిన ఎత్తిపోతల పథకం ఉపయోగంలో లేకపోవడంతో ఆయకట్టు చెరువుకు చుక్కనీరు చేరడంలేదు. చెరువు కింద పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సంబంధిత ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డికి కూడా తువ్వపల్లె, టమటంవారిపల్లె, మున్నెల్లి గ్రామాల ఫిర్యాదు కూడా చేశారు. అయినప్పటికీ స్పందన లేదు. కళ్ళ ముందు నీరు వెళుతున్నా ఆయకట్టు చెరువుకు అందించుకోలేని స్థితిలో మున్నెల్లి ఆయకట్టు రైతులు ఉండటంపై వారు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. రబీలోనైనా పంటలకు నీరు అందించి రైతులను ఆదుకుంటారన్న ఆశను అధికారులు, ప్రజా ప్రతినిధులు అడియాశలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఆయకట్టు చెరువుకు నీరు అందిస్తే సుమారు 300 ఎకరాలకు నీరు అందుతుందన్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రబీలోనైనా ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టు చెరువుకు నీరు అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమష్టి కృషితో సహకార సంఘం అభివృద్ధి


సహకార పతకాన్ని ఎగురవేస్తున్న సహకార సంఘం అధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు: సమష్టి కృషితో సహకార సంఘం అభివృద్ధి చెందుతుందని విభాగ సహకార అధికారి జె.సురేష్ కుమార్ తెలిపారు. మండలంలోని లింగాపురం గ్రామంలోని ఆంధ్రప్రగతి రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ కార్యాలయం వద్ద ఆదివారం సహకార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం సహకార పతకాన్ని ఎగురవేసి వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, పబ్లిక్ రంగ వ్యవస్థలతో పోటీగా సహకార సంఘాలు నడుస్తున్నాయన్నారు. సహకార సంఘం సమర్థవంతంగా నడపడానికి అవసరమయ్యే సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు సహకార వారోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఎంపీ ప్రభాకర్‌రావు, సంఘ మాజీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, సీఈఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

దువ్వూరు (చాపాడు): స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు అక్బల్ బాషా తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ మండల కార్యాలయంలో అన్ని శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారు. ప్రజలు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తహసీల్దారు తెలిపారు.

మహాన్ రియాల్టి ప్రాజెక్టు బ్రోచర్ విడుదల


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు: స్థానిక కేకే స్ట్రీట్‌లోని ఎస్కే గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆదివారం మహాన్ రియాల్టి అల్టీజియం ప్రాజెక్టుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే సంస్థ ఆధ్వర్యంలో పలు నిర్మాణాలను చేపట్టి ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారన్నారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఇరగంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో త్వరలో ఇక్కడ బ్రాంచ్ ఆఫీసును ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ ఈవీ మహేశ్వరరెడ్డి, పార్టనర్స్ ఎల్‌సీపీ సునీల్ కుమార్ రెడ్డి, ఇ.అనుదీప్‌రెడ్డి, డి.ప్రశాంత్‌రెడ్డి, కె.సుదర్శన్‌రెడ్డి, ఎ.శరణ్ రెడ్డి, బి.రఘునాథరెడ్డి, శివకుమార్, ప్రభాకరన్ పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహులకు నివాళి


అయ్యంకి, గాడిచర్ల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న జింకా సుబ్రహ్మణ్యం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రచయిత జింకా సుబ్రహ్మణ్యం గ్రంథాలయాల స్థాపనకు వారు చేసిన సేవను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాజశేఖరరాజు, విశ్రాంత వైమానిక దళాధికారి వెంకట కొండయ్య, రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్, రవిబాబు, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల కృషి అభినందనీయం

రాజుపాళెం: గ్రంథాలయ ఉద్యమకారులైన వెంకట రమణయ్య, సర్వోత్తమ రావుల కృషి అభినందనీయమని శ్రీసర్వజ్ఞ హైస్కూల్ కరస్పాండెంట్ నంద్యాల వెంకట శివారెడ్డి, మాజీ సర్పంచ్ సానా వెంకట సుబ్బారెడ్డి అన్నారు. 57 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా రాజుపాళెంలోని గ్రంథాలయంలో ఆదివారం ఉద్యమకారుల చిత్రపటాలకు వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విద్యార్థులంతా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు తెలిపారు. కార్యక్రమంలో పాఠకులు వెంకట రెడ్డి, రమణా రెడ్డి, గంగయ్య, దస్తగిరి, హనుమంతు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

అట్లూరు: దేశం కోసం పోరాడిన నాయకులను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ తెలిపారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో అల్లూరు సీతారామరాజు, పింగళి వెంకటయ్యల గురించి విద్యార్థులకు తెలిపారు.

గుండె జబ్బులను అశ్రద్ధ చేయొద్దు


గుండె పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం: గుండె జబ్బులను అశ్రద్ధ చేయరాదని కార్డియాలజిస్టు పాతకోట శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. నెహ్రూరోడ్డులోని లక్ష్మీ కార్డియాక్, కంటి ఆసుపత్రిలో ఆదివారం ఉచిత గుండె, కంటి పరీక్షలను నిర్వహించారు. డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి 45 మందికి గుండె పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా గుండె స్కానింగ్, ఈసీజీ చేశారు. డాక్టర్ హరిత 32 మందికి కంటి పరీక్షలు చేసి సూచనలు ఇచ్చారు. ప్రతి నెలా మూడవ ఆదివారం వైద్య నిర్వహించనున్నట్లు డాక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటి వరకు 43 వైద్య శిబిరాలను నిర్వహించి వేలాది మందికి పరీక్షలు చేశామన్నారు.

యువజనోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ


నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచిన నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక వైఎంఆర్ కాలనీలోని నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు కడప యోగివేమన యూనివర్సిటీలో నిర్వహించిన యువ ఉత్సవ్ 2024 జిల్లాస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచారు. జానపద బృంద నాట్యంలో ప్రథమ బహుమతి రూ.7వేలు, మెమెంటో, శాస్త్రీయ బృంద నాట్యంలో ద్వితీయ బహుమతి రూ.5వేలు, మెమెంటో, సర్టిఫికెట్లను ముఖ్య అతిథుల చేతుల మీదుగా పొందారు. నాట్యంలో ప్రతిభ కనపరచిన విద్యార్థులను ఆదివారం నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు మోహిద్దీన్‌ఖాన్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఉత్సాహంగా జిరాఫీ చెస్ పోటీలు


జిరాఫీ చెస్ పోటీలో విద్యార్థులు

ప్రొద్దుటూరు: స్థానిక పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిరాఫీ చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ లైబ్రేరియన్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎదుటివారిని ఓడించడానికి ఎత్తుకు పైఎత్తు వేస్తూ మీ చెస్ ఆటను ప్రారంభించాలన్నారు. ఆదివారం విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదివి మీ భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిరాఫీ చెస్ అకాడమీ కోచ్ నాగార్జునరెడ్డి, జేవీవీ కన్వీనర్ చంద్రశేఖర్‌రావు, ఆర్టీపీపీ ఇంజనీర్ ప్రభాకర్‌రెడ్డి, గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


ప్రసంగిస్తున్న వెంకటసుబ్బారెడ్డి

బ్రహ్మంగారిమఠం: ఆధ్యాత్మికత మానసిక ప్రశాంతతకు మార్గమని టీటీడీ ప్రచార వక్త చాపాటి వెంకటసుబ్బారెడ్డి అన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో బ్రహ్మంగారిమఠంలో జరుగుతున్న కార్తిక మాస వారోత్సవాల ఆదివారం చాతుర్మాస్య వ్రతం ప్రభావ నిరూపన అంశంపై ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ నిరంతర సాధనకు చాతుర్మాస్య వ్రతం ఉపకరిస్తుందని తెలిపారు. టీటీడీ ధార్మిక కార్యక్రమాల ద్వారా ప్రజలు, భక్తులు, చైతన్యవంతులై భక్తి భావనతో జీవితం ధన్యం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈశ్వరీదేవి పీఠాధిపతి వీర శివకుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.